# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 12-12-2024** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **భారతదేశ భవిష్యత్తుకు యువ ఆవిష్కర్తల పరిష్కారాలు కీలకమని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఉద్ఘాటించారు.**
2. **ఆంధ్రప్రదేశ్ లో గూగుల్ సంస్థ ప్రతిపాదిత పెట్టుబడులను స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు.**
3. **ఆంధ్రప్రదేశ్ లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ విడుదల చేశారు.**
4. **కొత్తగా శాసనసభకు ఎన్నికైన వారు సభకు హాజరయ్యే సంప్రదాయం కొనసాగించాలని తెలంగాణ శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సూచించారు.**
5. **ఈ రోజు ప్రపంచ ఆరోగ్య సదుపాయాల కల్పనా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.**

==========================

భారతదేశ భవిష్యత్తుకు యువ ఆవిష్కర్తల పరిష్కారాలు కీలకమని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఉద్ఘాటించారు. స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2024 ముగింపు వేడుకల సందర్భంగా యువ ఆవిష్కర్తలతో జరిగిన సంభాషణలో ఢిల్లీ నుండి నిన్న దృశ్య మాధ్యమం ద్వారా ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ, దేశం కొత్త సవాళ్లను ఎదుర్కొన్నప్పుడు యువ ఆవిష్కర్తల పరిష్కారాలు లక్షలాది మంది జీవితాలను మార్చగలవని అన్నారు. సాంకేతికకు కేంద్రప్రభుత్వం అధిక ప్రాధ్యానతనిస్తోందని ప్రధానమంత్రి పేర్కొంటూ...

..వాయిస్ 31 సెకన్లు

--------------------------

స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2024 కార్యక్రమంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ దృశ్య మాధ్యమ విధానంలో దేశ వ్యాప్తంగా పలు విద్యా సంస్థల విద్యార్థులతో సంభాషించారు. ఈ కార్యక్రమంలో తిరుపతి జిల్లా ఏర్పేడులోని భారతీయ సాంకేతిక విజ్ఞాన సంస్థ నుంచి పలువురు విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఐఐటి డైరెక్టర్ కేఎన్ సత్యనారాయణ మాట్లాడుతూ,

వాయిస్ (25 సెకన్లు)

ప్రధానమంత్రి ప్రసంగం ఎంతో స్ఫూర్తిదాయకంగా ఉందని విద్యార్థి శ్రీకాంత్ తెలుపుతూ,

వాయిస్ (25 సెకన్లు)

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో గూగుల్ సంస్థ ప్రతిపాదిత పెట్టుబడులను స్వాగతిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తెలిపారు. అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ సమక్షంలో గూగుల్ సంస్థ ప్రతినిధులు, ప్రభుత్వ ఉన్నతాధికారులు నిన్న ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ, రాష్ట్రంలో పెద్ద ఎత్తున ఐటీని అభివృద్ధి చేస్తామని గూగుల్ ప్రకటించిందని, విశాఖపట్నంలో పెట్టుబడులు పెట్టనుందని చెప్పారు. ఈ ఒప్పందం ద్వారా రాష్ట్రంలో పెట్టుబడులకు అనువైన వ్యవస్థ ఏర్పాటవుతుందని చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల షెడ్యూల్‌ను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ సామాజిక మాధ్యమం "ఎక్స్" వేదికగా విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి 17 నుంచి 31 వరకు పదవ తరగతి పరీక్షలు నిర్వహించనున్నారు. అలాగే మార్చి 1 నుంచి 19 వరకు ఇంటర్ మొదటి సంవత్సరం, మార్చి 3 నుంచి 20 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు నిర్వహించనున్నామని తెలిపారు. విద్యార్థులకు ఒత్తిడి లేకుండా రోజు విడిచి రోజు పరీక్షలు ఉండేలా జాగ్రత్తలు తీసుకున్నట్లు చెప్పారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు మంచి మార్కులు సాధించాలని మంత్రి సూచించారు.

---------------------------

కొత్తగా శాసనసభకు ఎన్నికైన వారు సభకు హాజరయ్యే సంప్రదాయం కొనసాగించాలని తెలంగాణ శాసన సభ వ్యవహారాల శాఖ మంత్రి డి. శ్రీధర్ బాబు సూచించారు. తెలంగాణ శాసనసభ, మండలి సభ్యులకు సభా వ్యవహారాల శిక్షణా తరగతులపై మంత్రి నిన్న హైదరాబాద్‌లో మాట్లాడుతూ, మొదటిసారి ఎన్నికైన శాసనసభ్యులు 57 మంది సభలో ఉన్నారని తెలిపారు. ఎమ్మెల్యేగా గెలిచి సభకు దూరంగా ఉండకూడదని సూచించారు. పార్లమెంట్‌లో ఇచ్చే ఉత్తమ పార్లమెంటేరియన్ పురస్కారం తరహాలో ఉత్తమ శాసనసభ వక్త అవార్డు ఇవ్వాలని శాసనసభాపతిని కోరామని మంత్రి తెలియజేశారు.

---------------------------

దేశంలోని విమానాశ్రయాల నిర్వహణలో అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తున్నామని కేంద్ర పౌర విమానాయాన శాఖ మంత్రి కె రామ్మోహన్ నాయుడు వెల్లడించారు. హైదరాబాద్‌లో ఎయిర్‌పోర్ట్ ప్రిడిక్టివ్ ఆపరేషన్ సెంటర్ ప్రారంభోత్సవంలో ఆయన నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ, దేశంలోని 24 విమానాశ్రయాల్లో డిజియాత్ర సాంకేతికను వినియోగిస్తూ, ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఆంధ్రప్రదేశ్‌లోని భోగాపురం విమానాశ్రయం 2026 జూన్ కల్లా పూర్తవుతుందని, మరో ఐదేళ్లలో 50 విమానాశ్రయాలు నిర్మించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని రామ్మోహన్ నాయుడు వివరించారు.

---------------------------

ప్రభుత్వ సమాచారం అంతా ఒకే చోట రాష్ట్ర అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరిచేలా చర్యలు తీసుకుంటున్నామని ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్ వెల్లడించారు. వాట్సప్ ద్వారా పౌరసేవలు అందించే అంశంపై కలెక్టర్ల సదస్సులో నిన్న మంత్రి మాట్లాడుతూ, వెబ్‌సైట్ ద్వారా ప్రభుత్వ సమాచారం అంతా వచ్చేలా కార్యాచరణ సిద్ధం చేస్తున్నట్లు తెలిపారు. 153 పౌర సేవలు వాట్సప్ ద్వారా ఇచ్చేందుకు వీలుగా కార్యాచరణ సిద్ధం చేశామని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ .. 36 సెకన్లు

---------------------------

ఈ రోజు ప్రపంచ ఆరోగ్య సదుపాయాల కల్పనా దినోత్సవం నిర్వహిస్తున్నారు. ప్రజలకు తగిన ఆరోగ్య సదుపాయాలు కల్పించే అంశంపై ఐక్యరాజ్యసమితి 2012 డిసెంబర్ 12న ఏకగ్రీవంగా తీర్మానం ఆమోదించిన సందర్భాన్ని పురస్కరించుకుని ప్రతిఏటా ఇదే రోజున ఈ కార్యక్రమం జరుగుతోంది. ఆర్థికభారం పడకుండా ప్రతి ఒక్కరూ మెరుగైన, నాణ్యమైన ఆరోగ్య సేవలను పొందే విషయంలో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమ నిర్వహణలోని ముఖ్యోద్దేశం.

---------------------------

వరంగల్ నగరాభివృద్ధిపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇంఛార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. హైదరాబాద్ లోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి వరంగల్ అభివృద్ధిపై నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో అభివృద్ధి పనులను ప్రాధాన్యతా క్రమంలో చేపట్టాలని, నిర్దేశించిన గడువులోగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం ప్రతిపాదించిన ప్రతి ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర నివేదికలను త్వరితగతిన రూపొందించాలని చెప్పారు. వరంగల్ నగర రింగ్ రోడ్డు జాతీయ రహదారులకు అనుసంధానమయ్యేలా నిర్మాణం చేయాలని మంత్రి అధికారులకు సూచించారు.

---------------------------

ఆంధ్ర ప్రదేశ్ తీరప్రాంత అభివృద్ధికి అనుసంధానంగా ఆర్థికాభివృద్ధిని ప్రోత్సహించడమే మారిటైం విధాన లక్ష్యమని రాష్ట్ర ప్రభుత్వం పేర్కొంది. పాలసీ విధివిధానాలు.. వాటి అమలుకు నిర్దేశించిన మార్గదర్శకాలను ఖరారు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. సముద్ర ఎగుమతుల్లో రాష్ట్రాన్ని బలోపేతం చేసేందుకు ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలను అభివృద్ధి చేయనున్నామని దీనికి ఈ విధానం దోహదం చేస్తుందని తెలిపింది. నౌకాశ్రయాల అభివృద్ధి, పోర్టులకు అనుసంధానంగా పారిశ్రామికీకరణ, నౌకా నిర్మాణ క్లస్టర్లు, లాజిస్టిక్స్ మౌలిక సదుపాయాలు, మారిటైం సేవలు, పర్యావరణ సుస్థిరత, నైపుణ్యాభివృద్ధి లక్ష్యాలను సాధించే దిశగా విధానాలను ఖరారు చేసినట్లు పేర్కొంది. పోర్టుల నిర్వహణ, మారిటైం కార్యకలాపాలకు సంబంధించి ఏక గవాక్ష విధానంలో అనుమతులు ఇవ్వనున్నట్లు తెలిపింది.

---------------------------

గ్రామస్థాయిల్లో నెలకొన్న భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి మీ భూమి – మీ హక్కు కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని ఏలూరు శాసనసభ్యులు బడేటి రాధా కృష్ణయ్య పేర్కొన్నారు.ఏలూరు జిల్లాలోని శనివారపుపేట గ్రామ సచివాలయంలో నిన్న నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని ప్రజల నుంచి

దరఖాస్తులను స్వీకరించారు. ఈ సందర్భంగా రాధా కృష్ణయ్య మాట్లాడుతూ, రెవిన్యూ సదస్సుల ద్వారా గ్రామ పంచాయతీల్లోని ప్రజల భూ సమస్యలకు పరిష్కారాలని ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం అందించే సేవల్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

-----------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 117వ సంచిక ఈనెల 29వ తేదీ ఆదివారం ప్రసారం కానుంది.."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 27వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

======================